క్లుప్తంగా

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

తాటిచెట్లపాలెం: బ్రహ్మకుమారీస్ రైల్వే న్యూకాలనీ శాఖ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం బ్రహ్మకుమారీలు, రోటరీ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు వ్యక్తుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయసు గల వారెవరైనా ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. శ్రీ తేజావతి మాతాజీ ప్రథమ వర్ధంతి సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ప్రేరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధి శశికళ చెప్పారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ సెంటర్ చైర్మన్ కె.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.మురళీధర్, డాక్టర్ అశోక్, సిబ్బంది, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



చాకలిపేటలో సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్ చాకలిపేటలో రూ.20 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజలకు ఎటువంటి సాయం కావాలన్నా నేరుగా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న పోతు సత్యనారాయణ

సీతంపేట: స్థానిక నెహ్రూ బజార్‌లో నిమ్మకాయలు, ఆకుకూరలు విక్రయిస్తూ జీవిస్తున్న దూసి అప్పలస్వామి ఇటీవల ఆకస్మికంగా మరణించాడు. దీంతో అతడి కుటుంబం ఆధారం లేక దిక్కులేనిదైంది. స్థానిక వ్యాపారుల ద్వారా విషయం తెలుసుకున్న 26వ వార్డు మాజీ కార్పొరేటర్ భర్త, స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ ఆ కుటుంబానికి ఆదివారం నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు. కార్యక్రమంలో బజారులోని వ్యాపారులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపండి



సీఐ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గంటా కామరాజు, భార్గవ్‌కుమార్, రమణ

కంచరపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ లా అండ్ ఆర్డర్ సీఐ కె.రవికుమార్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఐఎన్‌టీయూసీ కార్యదర్శి గంటా కామరాజు, జాతీయ క్రీడాకారుడు ఎస్.వి.రమణ, పార్టీ 55వ వార్డు యూత్ కార్యదర్శి గంటా భార్గవ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కంచరపాలెం పరిధిలో మత్తుకు బానిసవుతున్న యువతను సన్మార్గంలోని నడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. 55వ వార్డులో యువత కోసం అవగాహన సదస్సులు నిర్వహించేందుకు పోలీసులకు వైఎస్సార్‌సీపీ నుంచి సహకరిస్తామని భార్గవ్ కుమార్ తెలిపారు.

సింగరాయిమెట్టపై సమస్యల తిష్ట



49, 50 వార్డుల మధ్య విస్తరించి ఉన్న సింగరాయిమెట్ట కొండవాలు ప్రాంతం

ఇవీ సమస్యలు..

- సింగరాయిమెట్టపై ఎగువ ప్రాంతానికి వెళ్లే దారికి అనుబంధంగా ఒక చోట రక్షణ గోడ నిర్మించాల్సి ఉంది. భారీ వర్షాల సమయంలో ఇది చాలా అవసరం.
- ఎగువ నుంచి చెత్త దిగువకు వేయడంతో నివాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
- 49, 50 వార్డులు కలిపే ప్రాంతంలో సుమారు 200 మీటర్ల సిమెంట్ రోడ్డును నిర్మిస్తే స్థానికులకు ఇబ్బందులు తొలగుతాయి.
- దిగువ కాలనీలకు అనుబంధంగా ఉన్న కాలువల్లో పూడికను తొలగించడం లేదు. శానిటరీ **సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నివాసులు దుర్గంధం** మధ్య గడపాల్సి వస్తోంది.
- వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ రచ్చబండ పరిసర ప్రాంతాల్లో నాలుగు విద్యుత్ దీపాలు వెలగడం లేదు.
- వీధుల్లో లైట్లు వెలగకపోవడంతో చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు, కార్మికులు, ఉద్యోగులు వాపోతున్నారు. దొంగతనాలు జరుగుతున్నాయని, విష పురుగులు సంచరించడంతో ప్రమాదాల పాలవుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలన్నీ పరిష్కరించాలని సింగరాయిమెట్ట వాసులు **కోరుతున్నారు.**





నివాస ప్రాంతంలో వెలగని వీధిలైట్లు(53/జీ/7/5)

- రెండు వార్డుల కొండవాలు ప్రాంతంలో రక్షణ కరవు
- వీధుల్లో వెలగని విద్యుత్ లైట్లు
- కానరాని కాలువల శుభ్రత
- సమస్యల పరిష్కారానికి నివాసుల ఎదురుచూపులు





వ్యర్థాలతో నిండిన కాలువలు

మురళీనగర్: సింగరాయిమెట్ట కొండవాలు ప్రాంతంలో పలు సమస్యలు **తిష్ట వేశాయి. ఈ ప్రాంతం** 49, 50 వార్డుల మధ్య **విస్తరించి ఉంది. వైఎస్సార్** సీపీ జిల్లా అధ్యక్షుడు, **ఉత్తర సమన్వయకర్త** కె.కె.రాజు సహకారంతో కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్ ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. ఎగువ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలతోపాటు కొండ దిగువన నివాసులు ప్రధానంగా నాలుగు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటి పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెండు వార్డులకు కీలకం..

జీవీఎంసీ 49, 50 వార్డులకు సింగరాయిమెట్ట కీలక ప్రాంతంగా ఉంది. ఇది కొండవాలు ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు సమస్యలు ఉద్భవిస్తూనే ఉంటాయి. కొండపై బాబా గుడి నుంచి దిగువ ప్రాంతం, వెనక ఉన్న సాయిరాంనగర్ ప్రాంతాలు 50వ వార్డులో ఉండగా.. మురళీనగర్ సెక్టార్–1ని ఆనుకుని ఎగువన ఉన్న ప్రాంతంతోపాటు సత్యానగర్ ప్రాంతాలన్నీ 49వ వార్డులో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలన్నీ కొండ ప్రాంతంలో నివసిస్తున్నాయి. దిగువ ప్రాంతాల్లో అనేక అపార్ట్‌మెంట్లు వెలసి ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వారు నివసిస్తున్నారు. దిగువన ఉన్నవారి సురక్షిత నివాసాల్లో **ఉన్న ప్రజలతోపాటు ఎగువ ప్రాంతాల** వారు **కొన్ని సమస్యలతో ఇబ్బంది పడుతు**న్నారు.



ఎగువ ప్రాంతంలో సిమెంట్ రోడ్డుగా మార్చాల్సిన రెండు వార్డులను కలిపే మట్టి దారి



మెట్టపై రక్షణ గోడ నిర్మించాల్సిన ప్రాంతం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సింగరాయిమెట్ట ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి స్థానికుల మన్నన పొందారు. ఎగువ కొండపైకి సిమెంట్ రోడ్డు నిర్మించి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎగువ నివాసాల మధ్యలో మెట్ల మార్గాలను నిర్మించారు. మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అటు 50వ వార్డు.. ఇటు 49వ వార్డుల మధ్య అనుసంధాన రహదారులు నిర్మించారు. కొండపైకి విద్యుత్ లైన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటర్లు పెట్టనివ్వొద్దు



తెన్నేటినగర్‌లో స్మార్ట్ మీటర్ల నష్టాలపై ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

మురళీనగర్: స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిస్తూ సీపీఎం ఇంటింటి ప్రచారం ప్రారంభించింది. 50, 51 వార్డుల్లో ఆదివారం పార్టీ నాయకులు ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. మాధవధార, తెన్నేటినగర్, అంబేడ్కర్ నగర్ కాలనీ, మాధవధార మెయిన్ రోడ్డు, వుడా కాలనీల్లోని అపార్ట్‌మెంట్ వాసులను కలిసి స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అదానీ కంపెనీ సిబ్బంది ఇంటికి వచ్చి స్మార్ట్ మీటర్లు బిగించుకోవాలని కోరినప్పుడు తక్షణం తిరస్కరించాలన్నారు. మీటర్లను తప్పనిసరిగా మార్చుకోవాలని ప్రభుత్వం, విద్యుత్ సంస్థల ఆదేశాలు లేవన్నారు. రానున్న రోజుల్లో ప్రతి రోజునూ పీక్ అవర్స్, నాన్ పీక్ అవర్స్‌గా విభజించి విద్యుత్ చార్జీలు వసూలు చేసే అవకాశముందన్నారు. వాస్తవానికి విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిని పట్టుకోవడం చేతకాని పాలకులు ప్రజలందరినీ ఒకే గాటన కట్టి స్మార్ట్ మీటర్లు బిగించడానికి పూనుకోవడం అన్యాయమన్నారు. విద్యుత్ వ్యవస్థను కాపాడుకోడానికి, మన జేబు దోపిడీని అరికట్టడానికి స్మార్ట్ మీటర్లను పెట్టనివ్వొద్దని నాయకులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నగర వ్యాప్తంగా నిర్వహించే నిరసన ప్రదర్శనలు, ప్రచార కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. సీపీఎం నాయకులు కూన సత్యనారాయణ, సనపల రామ్ గోపాలరావు, కె.సుధాకర్, కె.పార్వతి, భవాని, ఎస్.అమలమ్మ, చిలకమ్మ, నర్సింగరావు, జి.ఎస్.మూర్తి, శ్రావణ కుమార్, గోపాలకృష్ణ, కె.పాపారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్




కథల తయారీపై చిన్నారులకు సూచనలిస్తున్న సీతా శ్రీనివాస్



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన ప్రత్యేక నైపుణ్య ఆధారిత సృజనాత్మక పిల్లల కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 70 మంది పిల్లలు పాల్గొన్నారు. స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం వర్క్‌షీట్ కార్యాచరణతో ప్రారంభమైంది. పిల్లలు ఆకారాలు గీయడం, బొమ్మలను అనుసంధానం చేయడం, పాత్రలను కనుగొనడం వంటి విశేషమైన నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరికీ ఒక పాత్ర అప్పగించి వాటి ఆధారంగా బృందాలను ఏర్పాటు చేసి, అనంతరం వారు బొమ్మలకు రంగులు వేసి తమ పాత్రల ఆధారంగా కథలు తయారు చేసి వాటిని ప్రేక్షకులకు ప్రదర్శించారు. కేవలం కథ మాత్రమే కాకుండా విజువల్ కోడింగ్, సృజనాత్మక ఆలోచన, బృంద సహకారం, కథన నైపుణ్యం, ప్రెజెంటేషన్ వంటి నైపుణ్యాలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా సీతా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచాలని, తద్వారా ఊహాశక్తి, ఏకాగ్రత, అధ్యయనంపై ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు.

రంజింపజేసిన నిర్విరామ సినీ సంగీత విభావరి



ఇళయరాజా పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: నీలు స్వరాంజలి బ్యానర్‌పై 'ఇళయరాజా మాస్ట్రో మేనియా' పేరిట 12 గంటల పాటు నిర్విరామ సినీ సంగీత విభావరి కార్యక్రమం ఆద్యంతం అలరించింది. నీలు స్వరాంజలి అధినేత్రి నీలు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది గాయనీ గాయకులు పాల్గొని ఇళయరాజా దర్శకత్వంలో వెలువడిన పలు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను రంజింపజేశారు. కురిసేను విరిజల్లులే, మధుర మురళి హృదయ రవళి, ఏ ఊహలోనో, ఉండాలి నీ గుండెల్లో, వేదం అణువణువునా నాదం, రాసలీల వేళ, నిన్ను కోరి వర్ణం, చిలకమ్మా చిటికెయ్యంగా, ఓం నమః వంటి మధుర గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా నీలు మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలైలో సినీ సంగీత విభావరి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మూడేళ్లుగా ఈ కార్యక్రమం విజయవంతంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన గాయనీగాయకులు చక్కటి గాత్ర ధర్మం ప్రదర్శించి 12 గంటల నిర్విరామ సంగీత విభావరిని విజయవంతం చేశారని కొనియాడారు. అనంతరం లఖినేని బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలు స్వరఝరి సంస్థ బ్యానర్‌ను నీలు చేతుల మీదుగా ఆవిష్కరించారు. స్వరాంజలి అధినేత్రి నీలును గాయనీ గాయకులు సత్కరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గౌరీ సేవా సంఘం పోర్టు విభాగం సభ్యులు

సీతంపేట: శ్రీగౌరీ సేవా సంఘం పోర్టు వింగ్ 44వ వార్షికోత్సవ సభ ఆదివారం న్యూకాలనీలోని కృష్ణ టవర్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాళ్ల నళిని పదవీ విరమణ చేసిన పోర్టు ఉద్యోగులను సన్మానించారు. ఉద్యోగుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం 2025–2027 కాలనికి నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. బొడ్డేడ భాస్కరరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా పొలమరశెట్టి ఎస్.జె.వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సూరిశెట్టి జగ్గ అప్పారావు, కార్యదర్శిగా దాడి గోవిందరాజు, కోశాధికారిగా రాపేటి చంద్రరావు, ఉపాధ్యక్షులుగా దాడి వి.వి.రామారావు, బీశెట్టి అప్పారావు, మద్దాల గోవిందరాజు, సంయుక్త కార్యదర్శులుగా కాళ్ల వరప్రసాద్, రాపేటి కృష్ణ అప్పారావు, ససారం రాజారావు, ఎస్‌వీఎస్ అప్పారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆళ్ల జగ్గారావు, సిహెచ్.రామారావు, మద్దాల వి.వి. అప్పారావు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో బాబు ఘనుడు

- పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 47వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, పార్టీ నాయకులు

కంచరపాలెం: దగా, మోసం, వెన్నుపోటులో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ధ్వజమెత్తారు. 47వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి కప్పరాడ కొండవాలు ప్రాంతంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కుందిరి సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు, ఏడాది పాలనలో హామీలు అమలు చేయలేక విఫలమయ్యారని కె.కె.రాజు ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కేవలం ప్రచారం మాత్రమే చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలంలో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చి, ఇచ్చిన హామీల కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేసి గర్వంగా గడప గడపకూ వెళ్లి చెప్పుకున్నామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఒక్క పని చేయకపోయినా ఎంతో చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయండని అడిగిన వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజల్లోకి చంద్రబాబు మోసాలు

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు. అనంతరం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కరపత్రాలను ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సేనాపతి అప్పారావు, నీలి రవి, వార్డు నాయకులు మోటూరి రాఘవులు, లక్ష్మణ్, సురేష్‌కుమార్, కృపా, కార్యకర్తలు, బూత్ కన్వీనర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన చోదకులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారిని తనిఖీ చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డు కరాస నుంచి కంచరపాలెం మెట్టు వరకు ద్విచక్ర వాహన చోదకుల వద్ద పత్రాలు పరిశీలించి, హెల్మెట్ ధరించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలను వాహన చోదకులకు వివరించారు. పత్రాలు లేకుండా నడిపిన వారి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

ఆలయ ప్రతిష్టను దిగజార్చకండి

- ఎర్నిమాంబ దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు, గ్రామ పెద్దలు



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం

కంచరపాలెం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ఈవో సురేష్‌బాబాపై తప్పుడు వార్తలు ప్రచురించడం సరికాదని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, జ్ఞానాపురం, అచ్చియ్యమ్మపేట గ్రామ పెద్దలు హెచ్చరించారు. ఈ మేరకు జ్ఞానాపురం ఆలయ ఆవరణలో ఆదివారం ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రకటన విడుదల చేశారు. కొన్ని చిన్న వార్తా పత్రికలు, యూట్యూబ్ చానెళ్లు తప్పుడు వార్తలు ప్రచురించి, ఆలయంలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తూ, ఆలయ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. పాలకవర్గం సమన్వయంతో ఉత్సవాల నిర్వహణలోనూ, దేవాలయ అభివృద్ధిలోనూ, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలోనూ, ఆలయ ఖర్చులు తదితర అన్ని విషయాల్లోనూ పారదర్శకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటికి ఆలయ వార్షిక ఆదాయం రూ.81.46 లక్షలు ఉండేదని, నేడు రూ.2.62 కోట్లకు పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేని నేటి కూటమి నాయకుల ప్రమేయంతో దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలయ చైర్మన్ లండా రమణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఆదినారాయణ, వి.నారాయణ, శ్యామ్, తేజా, రత్నం, గౌరీ, దానయ్యమ్మ, అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం ఆలయ సంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



కె.కాలనీ హైస్కూల్ 1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సందడి

కంచరపాలెం: కంచరపాలెం దరి సాంబమూర్తినగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ టెన్త్ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ కలయికతో సందడి చేశారు. 30 ఏళ్ల నాటి జ్ఞాపకాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు, పనుల్లో బిజీగా మారిన స్నేహితులు ఖరగ్‌పూర్, కరీంనగర్, ఏలూరు, తాడేపల్లిగూడెం, హైదరాబాద్, బెంగళూర్, ముంబయ్ వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఉత్సాహంగా గడిపారు. మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆటపాటలు, విందుతో సందడి చేశారు.